# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 13-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ మౌలిక సదుపాయాల కల్పనలో భారత్ అద్భుతమైన పురోగతిని సాధిస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు.
- ❖ ప్రజల అపారమైన వైవిధ్యాన్ని సంగ్రహించడమే నిజమైన ప్రపంచీకరణ అని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు.
- ❖ ఇస్రో చేపట్టిన స్పేడెక్స్ డీ డాకింగ్ ప్రక్రియ విజయవంతం కావడంతో భవిష్యత్ అంతరిక్ష ప్రయోగాలకు మార్గం సుగమం అయ్యిందని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు.
- ❖ ప్రపంచ వ్యాప్తంగా 30 కోట్ల మంది యోగాను అభ్యసిస్తూ ప్రయోజనం పొందుతున్నారని కేంద్ర సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ వెల్లడించారు.

========================

కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా గుజరాత్ లోని గాంధీనగర్‌లో 146 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు దృశ్య మాధ్యమం ద్వారా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భారత్ అద్భుతమైన పురోగతిని సాధిస్తోందన్నారు. భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలో రెండవ పొడవైన రోడ్డు నెట్‌వర్క్ ను, మూడవ అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్‌ను కలిగి ఉందని పేర్కొన్నారు. గుజరాత్‌లో జరుగుతున్న అభివృద్ధిని ప్రస్తావిస్తూ... రైల్వేలు, రోడ్లు, ఇంధన రంగానికి సంబంధించిన అనేక ప్రాజెక్టులతో రాష్ట్రం గణనీయమైన పురోగతిని సాధించిందని తెలుపుతూ....

(వాయిస్ 37 సెకన్లు)

========================

ప్రజల అపారమైన వైవిధ్యాన్ని సంగ్రహించడమే నిజమైన ప్రపంచీకరణ అని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు. ఈ సంవత్సరం మే నెలలో ముంబైలో నిర్వహించనున్న వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్

సమ్మిట్ "వేవ్స్"పై ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రపంచం ఇప్పటికే ఆర్థిక, రాజకీయ సమతుల్యతను మరలా చూస్తోందని, ఇప్పుడు సాంకేతికత, సాంస్కృతిక కోణాల వైపు కదులుతోందని పేర్కొన్నారు.

(వాయిస్ 32 సెకన్లు)

కేంద్ర సమాచార ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ... వివిధ వర్గాల నుండి వచ్చిన ఆధునిక యుగ సృష్టికర్తలు ఉన్నతమైన విలువను సృష్టించగలగడానికి "వేవ్స్" గొప్ప వేదిక అని, అదే వేవ్స్ యొక్క ప్రాథమిక భావన అని పేర్కొన్నారు. దేశంలో ఒక బిలియన్ మందికి పైగా మొబైల్ ఫోన్లు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు డిజిటలైజేషన్‌కు అలవాటు పడ్డారని కేంద్ర మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 18 సెకన్లు)

========================

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ISRO) ఇటీవల చేపట్టిన స్పేడెక్స్ డీ డాకింగ్ ప్రక్రియ విజయవంతమైంది. అంతరిక్ష ప్రయోగాల్లో భాగంగా ఉపగ్రహాలను నింగిలోనే అనుసంధానం చేసే ఈ కార్యక్రమం విజయవంతం కావడం పట్ల కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్ హర్షం వ్యక్తం చేస్తూ... ఇస్రోకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ విజయం ప్రతి భారతీయుడిలో ఉత్సాహాన్ని నింపుతుందని, డీ డాకింగ్ ప్రక్రియను స్పేడెక్స్ శాటిలైట్లు సమర్ధవంతంగా పూర్తి చేశాయని సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. భారతీయ అంతరిక్ష స్టేషన్, చంద్రయాన్ - 4, గగన్‌యాన్ సహా భవిష్యత్ ప్రయోగాలకు దీని ద్వారా మార్గం సుగమం అయ్యిందని వ్యాఖ్యానించారు. ఇస్రో.. గత సంవత్సరం డిసెంబర్ 30న ఛేజర్, టార్గెట్ జంట ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపించింది. పలు ప్రయత్నాల అనంతరం చివరకు జనవరి 16న డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించడం ద్వారా భారత్ ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా నిలిచింది.

========================

ప్రపంచ వ్యాప్తంగా జూన్ 21న జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి 100 రోజుల కౌంట్‌డౌన్‌ను పురస్కరించుకుని, కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావు జాదవ్ ఈరోజు న్యూఢిల్లీలో యోగా మహోత్సవ్- 2025ను ప్రారంభించారు. ఈ 100 రోజుల్లో దేశంలోని వివిధ ప్రాంతాల్లో 10 ముఖ్యమైన కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ కార్యక్రమాల కింద, 10 భాగస్వామ్య దేశాలతో యోగా బంధన్ నిర్వహిస్తామన్నారు. దేశంలోని 10 వేల ప్రదేశాలలో యోగా సంగం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 30 కోట్ల మంది యోగాను అభ్యసిస్తున్నారని, తద్వారా వారికి ఎంతో ప్రయోజనం చేకూరిందని కేంద్ర సహాయ మంత్రి వివరించారు.

విరామం

========================

హోలీ పండుగ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రంగుల పండుగ అయిన హోలీ మనందరితో ఆనందాన్ని, ఉత్సాహాన్ని తెస్తుందని రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు. హోలీ పండుగ సందర్భంగా ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ... చెడుపై మంచి సాధించిన విజయాన్ని, వసంతకాలం రాకను హోలీ సూచిస్తుందన్నారు. హోలీ ప్రకాశవంతమైన రంగులు భారతదేశ గొప్ప సాంస్కృతిక వైవిధ్యాన్ని గుర్తు చేస్తాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలియజేస్తూ.... ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఉత్సాహాన్ని శక్తిని నింపుతుందని సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

========================

రైతుల నుండి కందుల సేకరణ ప్రక్రియను వేగవంతం చేసినట్టు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ నెల 11వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుండి మొత్తం 1.31 లక్షల మెట్రిక్ టన్నుల కందులు సేకరించడం జరిగిందని ఆ శాఖ ఈరోజు తెలిపింది. తద్వారా ఈ రాష్ట్రాలలోని 89 వేల 219 మంది రైతులకు ప్రయోజనం చేకూరిందని పేర్కొంది. సమీకృత ప్రధాన మంత్రి అన్నదాత ఆయ్ సంరక్షణ్ అభియాన్ (PM-AASHA) ధరల మద్దతు పథకం కింద, కేంద్ర నోడల్ ఏజెన్సీలు... రాష్ట్ర స్థాయి ఏజెన్సీల ద్వారా ముందుగా నమోదు చేసుకున్న రైతుల నుండి గుర్తించబడిన పప్పుధాన్యాలు, నూనెగింజలు, కొబ్బరి కనీస మద్దతు ధరలకు సేకరించడం జరుగుతుందని కేంద్ర వ్యవసాయ శాఖ వివరించింది.

========================

గడచిన 5 సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ కింద దేశంలోని దాదాపు 12.28 కోట్ల గ్రామీణ కుటుంబాలకు కుళాయి నీటి కనెక్షన్లు అందించిందని కేంద్ర జల్ శక్తి  శాఖ సహాయ మంత్రి వి.సోమన్న తెలిపారు. దీంతో ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందిన మొత్తం గృహాల సంఖ్య 15.51 కోట్లు దాటిందని పార్లమెంట్‌లో ఆయన వివరించారు. 2019లో జల్ జీవన్ మిషన్ ప్రారంభించినప్పుడు దేశంలోని 16.8 శాతం గ్రామీణ కుటుంబాలకు మాత్రమే మంచినీటి కుళాయి సదుపాయం ఉండగా.. ప్రస్తుతం 79.91 శాతం గ్రామీణ కుటుంబాలకు ఈ సదుపాయం కలిగిందని కేంద్ర సహాయ మంత్రి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి, నీటి వనరుల నిర్వహణ, వనరుల బలోపేతం, పంపిణీ నెట్‌వర్క్, మానవ వనరులు అవసరమని వి.సోమన్న ఈ సందర్భంగా తెలియజేశారు.

========================

భారతదేశం GDP వృద్ధి 2025-26 కాలంలో 6.5 శాతం కంటే ఎక్కువగా ఉంటుందని మూడీస్ నివేదిక అంచనా వేసింది. ప్రభుత్వ మూలధన వ్యయం పెరగడం, ఆదాయపు పన్ను తగ్గింపు, RBI వడ్డీ రేట్లను తగ్గించడం వల్ల వినియోగంలో పెరుగుదల నేపథ్యంలో జీడీపీ వృద్ధి రేటు ఈ విధంగా ఉంటుందని మూడీస్ పేర్కొంది. 2024 మధ్యలో తాత్కాలికంగా మందగించిన తర్వాత, భారత్ ఆర్థిక వృద్ధి వేగవంతం అవుతోందని, అలాగే ప్రపంచంలోని పెద్ద ఆర్థిక వ్యవస్థలలో అత్యంత వేగవంతమైన రేటును నమోదు చేస్తుందని నివేదిక వివరించింది.

========================
========================